వరదనీటి కాలువ పనులు ఇంకెన్నాళ్లు?

- నిజాంపేట్ రోడ్‌లో వాహనదారుల అవస్థలు
- ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోతున్న అంతర్గత రహదారులు

హైదర్‌నగర్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్‌లో జాతీయ రహదారి నుంచి నిజాంపేట్, బాచుపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో శ్రీహోలిస్టిక్ ఆస్పత్రి వద్ద అధికారులు వరదనీటి కాలువ విస్తరణ మరమ్మతు పనులను ప్రారంభించారు. రోజుల తరబడి ఈ పనులు సా..గుతూనే ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో వాహనదారుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. నిజాంపేట్ నుండి వచ్చే వాహనాలు ఆదిత్యనగర్ వైపు మళ్లించి పలుకాలనీల లోపలగుండా వెళ్లాలని ట్రాఫిక్ అధికారులు సూచించారు. దీంతో డివిజన్‌లోని అంతర్గత రహదారులన్నీ ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోతున్నాయి.



ఆదిత్యనగర్ రోడ్డులో ట్రాఫిక్ జాం

రాకపోకలకు ఇబ్బందులు

కూకట్‌పల్లి జాతీయ రహదారి నుంచి నిజాంపేట్ మీదుగా ఔటర్‌రింగ్ రోడ్డుకు చేరుకునే వారు, నగర శివారు ప్రాంతాలకు వెళ్లే వాహన దారులు నిత్యం ఇదే దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే నగరంలో నుంచి శివారు ప్రాంతాల కళాశాలల, పాఠశాలల బస్సులతో ఈ దారి నిత్యం రద్దీగా ఉంటోంది. లక్షలాది మంది రాకపోకలకు ఆధారంగా ఉన్న ఈ దారిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. సంక్రాంతి సెలవుల్లో ఈ విస్తీర్ణ పనులు చేపడితే రద్దీ సమస్య తక్కువగా ఉండేదని వాహనదారులు అంటున్నారు. కాని అధికారులు ఎలాంటి అవగాహన లేకుండా రెండు రోజుల ముందు పనులు ప్రారంభించారు.

రెండు నిమిషాల ప్రయాణానికి అర్ధగంట

జాతీయ రహదారికి చేరుకునేందుకు నిజాంపేట్ రోడ్డు నుంచి వాహనాలను కొలన్ రాఘవరెడ్డి ఫంక్షన్ హాల్ ముందు ఉన్న హైటెన్షన్ దారి నుంచి ఆదిత్యనగర్ వైపు మళ్లిస్తున్నారు. హైటెన్షన్ లింక్ రోడ్డులో కాలనీలోకి ప్రవేశించిన వాహన దారులు ఆదిత్యనగర్, భాగ్యనగర్‌కాలనీ ఫేజ్-3, సమతానగర్, హెచ్ఎంటీహిల్స్, అడ్డగుట్ట తదితర కాలనీల నుంచి కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్ వద్ద ప్రధాన రహదారిపైకి చేరుకుంటున్నారు. నిజాంపేట్ ప్రధాన రహదారిలో రెండు నిమిషాలు సాగే ప్రయాణం కాలనీలో అర్ధగంట నుంచి 45 నిమిషాల సమయం పడుతుంది.

అడ్రస్‌లేని ట్రాఫిక్ పోలీసులు

అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు దానికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లించాలి. కానీ ట్రాఫిక్ అధికారులు ఓ పేపర్ ప్రకటన విడుదలచేసి చేతులు దులుపుకున్నట్లుగా కనిపిస్తోంది. రద్దీ సమయాల్లో ఆదిత్యనగర్ జంక్షన్, ఎంఎస్ఆర్ కాలేజ్ జంక్షన్, సమతానగర్, భాగ్యనగర్ ఫేజ్-3లో ఒక్కచోట కూడా ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడం వల్ల అన్ని జంక్షన్లలో గంటల తరబడి ట్రాఫిక్‌తో నిండిపోయాయి. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు ఎక్కడా కనిపించక పోవడం పట్ల కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనులు త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు



నిజాంపేట్ రోడ్‌లో వర్షం పడినప్పుడు పలు ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వరదనీటి కాలువ నిర్మాణం చేపట్టాం నిజాంపేట్ రోడ్‌లో బాచుపల్లి, నిజాంపేట్ నుండి వచ్చే లక్షలాది వాహనాలను దారిమళ్లించి నిర్మాణ పనులు చేపట్టాం. ప్రతి రోజు ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలిస్తున్నాం. వీలైనంత త్వరగా వరదనీటి కాలువ పనులను పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

\- నార్నె శ్రీనివాసరావు, కార్పొరేటర్, హైదర్‌నగర్



హాస్టళ్లలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఇన్‌చార్జి వీసీ, అధికారులు

జేఎన్‌టీయూ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీ

సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించిన ఇన్‌చార్జ్ వీసీ

హైదరాబాద్ సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ బాలకిష్టారెడ్డి శనివారం విద్యార్థుల హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంజీర, కిన్నెర, కృష్ణ, గౌతమి హాస్టళ్లను సందర్శించి ఆయన విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. అనంతరం వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సంబంధిత విభాగం అధికారులను ఆదేశించారు. విద్యార్థులంతా తమ బైక్‌లను పార్క్ చేసేందుకు గౌతమి హాస్టల్ సెల్లార్‌ను, వాహనాల పార్కింగ్ కోసం వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు స్పందించిన అధికారులు, గౌతమి హాస్టల్ సెల్లార్‌ను వాహనాల పార్కింగ్‌కు మార్చుతూ ఉత్తర్వులు జారీచేశారు. యూనివర్సిటీ సంబంధిత సమస్యలు ఉన్నట్లయితే విద్యార్థులు తన దృష్టికి తేవాలని వీసీ సూచించారు.



జూనియర్ ఎన్టీఆర్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కేపీహెచ్‌బీ పీఎస్ ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు, తదితరులు

జూనియర్ ఎన్టీఆర్ క్యాలెండర్ ఆవిష్కరణ

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ అఫీషియల్ 2025 క్యాలెండర్‌ను కేపీహెచ్‌బీ పీఎస్ ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అభిమాన నటుల సినిమాలు విడుదలయినప్పుడు ఆయా థియేటర్ల వద్ద ఫ్యాన్స్ జాగ్రత్తలు తీసుకోవాలని, అందుకు పోలీసుల సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు పిన్నింటి మురళి, సభ్యులు దొడ్డి రంగస్వామి, జి.సుమన్, ఎస్. జగదీష్, నాని, ఉదయ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



రమ్యగ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ పనుల ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, తదితరులు

సొంత నిధులతో వాకింగ్ ట్రాక్ పనులు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రమ్యగ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ పనులను తన సొంత నిధులను వెచ్చించి పునఃనిర్మిస్తానని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు స్థానికులకు హామీ ఇచ్చారు. గత 15 ఏళ్ల క్రితం నిర్మించిన వాకింగ్ ట్రాక్ ధ్వంసం కావడం, నడకకు వచ్చే వారికి ఇబ్బందిగా ఉందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం మందడి శ్రీనివాసరావు రమ్యగ్రౌండ్‌ను పరిశీలించారు. ట్రాక్‌లో పేరుకుపోయిన మట్టి, రాళ్లను తొలగించి పునఃనిర్మించే పనులను ప్రారంభించారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శివశక్తి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు కట్టా నరసింగరావు, కాముని నరసింహారెడ్డి, వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, జాలారి శివనారాయణరావు, రవీందర్‌రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.



అవంతీనగర్ తోటలో రోడ్డు పార్కింగ్‌లైన్‌ల పనులను పరిశీలిస్తున్న కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ

రోడ్డుపై పార్కింగ్ లైన్‌లు

కూకట్‌పల్లి, జనవరి, 11 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్ సమస్యల పరిష్కారం కోసమే రోడ్డుపై లైన్‌లు వేయడం మంచి నిర్ణయమని అవంతీనగర్ కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ అన్నారు. మూసాపేట డివిజన్ పరిధిలోని అవంతీనగర్‌తోటలో రోడ్డుకు అధికారులు పార్కింగ్ లైన్‌లు వేశారు. పార్కింగ్ లైన్‌లు లేకపోవడంతో ప్రజలు తమ ఇష్టారీతిగా రోడ్డుపై వాహనాలను నిలుపుతుండటంతో సమస్యలు వస్తున్నాయని, ఇప్పుడు వాహనాల పార్కింగ్ గీత లోపల చేసుకోవాలని కాలనీవాసులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కాలనీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ స్వామి, కాలనీ సంక్షేమసంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వాహనదారులకు గులాబీ పువ్వును అందజేస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ త్రివేణిబాయి, సిబ్బంది

నిబంధనలను పాటించాలని ప్రచారం

పేట్‌బషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాలను నివారించేందుకు నిబంధనలను పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ త్రివేణిబాయి అన్నారు. శనివారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని మేడ్చల్ ఆర్టీఏ కార్యాలయం ముందు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వీస్ రోడ్డులో వచ్చి పోయే వాహనాలను తనిఖీలు చేసి సీటు బెల్ట్, హెల్మెంట్ ధరించని వాహనదారులకు గులాబీ పుష్పాలను అందజేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ప్రయాణం చేస్తే, గమ్య స్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చని ఆమె తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే



అంగన్‌వాడీ విద్యార్థుల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గాంధీ



లబ్ధిదారుడికి సీఎం ఫండ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్

హైదర్‌నగర్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఎస్‌కె సోహైల్ అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతనికి మంజూరైన రూ.2.50 లక్షల మంజూరు పత్రాలను కార్పొరేటర్లు వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులందరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలన్నారు. సీఎం సహాయ నిధి అపదలో ఉన్న వారికి ఆపన్నహస్తంలా నిరంతరం సేవలు అందిస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో నాయులు రవీందర్ ముదిరాజ్, ఖాదర్‌బాయ్, బోయ కిషన్, మోజేష్, భాస్కర్, ఖలీమ్, అన్వర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీడీపీఓ

శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓగా బాధ్యతలు స్వీకరించిన కవిత శనివారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అంగన్‌వాడీ విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలను, యూనిఫామ్‌ను ఆయన ఆవిష్కరించారు. అంగన్‌వాడీ విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించడం జరుగుతుందని, మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, చిన్నపిల్లలు, గర్భిణులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కోమలి, మాధురి, జ్యోతి, టీచర్లు పాల్గొన్నారు.

ఒడిశా నుంచి ధూల్‌పేటకు గంజాయి

- నిఘాపెట్టి పట్టుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు
- రూ. 5.25 లక్షల విలువైన 21 కేజీల సరుకు స్వాధీనం
- 14 మందిపై కేసు నమోదు.. ఆరుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లుగప్పి, గుట్టుచప్పుడు కాకుండా ఒడిశా నుంచి ధూల్‌పేటకు గంజాయిని సరఫరా చేస్తున్న ముఠాను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 14 మంది నిందితులపై కేసులు నమోదు చేసిన పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 21 కేజీల గంజాయి, స్కూటీ, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 5.25 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ధూల్‌పేటకు చెందిన ఆకాశ్‌సింగ్ ఇంట్లో గంజాయి నిల్వ ఉందని ఎక్సైజ్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో శనివారం టీమ్ లీడర్ అంజిరెడ్డి పర్యవేక్షణలో ఎస్‌టీఎఫ్(స్టేట్ టాస్క్‌ఫోర్స్) బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో ఆకాష్‌సింగ్ ఇంట్లో 21 కేజీల గంజాయి దొరికింది. అతడిని విచారించగా.. ఆకాష్‌సింగ్, దుర్గేష్‌సింగ్, ఆనంద్ సింగ్, శంకర్ సింగ్రా, హాల్ సింగ్, లలిత్ కుమార్ కలిసి ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని తెప్పించినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరి ని విచారించిన క్రమంలో ఒడిశాకు చెందిన సురేష్ యాదవ్, ఉదయ్ సురేష్ దాలి, సరోజిత్ మరిదా, రాహుల్ సర్కార్, లంకా కుమార్, లాంప్‌లు గంజాయిని విక్రయించినట్లు తేలింది. వీరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ధూల్‌పేట్ ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐ సైదులు, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి అజీమ్, శ్రీధర్, కానిస్టేబుళ్లు ప్రకాష్, రాకేష్, మహేష్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.



గంజాయి మూటతో పట్టుబడిన నిందితులు

నేడు శృంగేరీ శారద శంకర మఠంలో పారాయణం

కూకట్‌పల్లి, జనవరి, 11 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్ శృంగేరి శారద శంకర మఠంలో శ్రీ లలిత సహస్రనామ అఖండ పారాయణం పఠనం ఉందని శంకరమఠం ప్రతినిధి మూర్తి తెలిపారు. అదివారం శృంగేరీమఠంలో ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అఖండ పారాయణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వసంతనగర్ వాసులు

ఉచిత వైద్య శిబిరానికి 72 మంది హాజరు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వసంతనగర్ లైబ్రరీ హాల్‌లో బెల్ రైస్ కంపెనీ ఎండీ రాఘవరెడ్డి సూచనల మేరకు ముత్తూట్ జార్జ్ ఫౌండేషన్ సహకారంతో ఈనెల 10, 11 వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి 72 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కిడ్నీ, గుండె, లివర్, డయాబెటిక్, హైపర్ టెన్షన్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి రోగులకు డాక్టర్‌లు సలహాలు, సూచనలు అందజేసినట్లు పేర్కొన్నారు. వృద్ధులు ఏడాదికోసారి పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. ఆహారం తీసుకోవడంలో కూడా జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

నేడు జర్నలిస్టులకు ఉచిత వైద్యపరీక్షలు

హైదర్‌నగర్, జనవరి11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఆరోగ్యభద్రత కోసం ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లాశాఖ అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు తెలిపారు. బండారు ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ సుశ్రుత్ పర్యవేక్షణలో వైద్యశిబిరం జరుగుతుందన్నారు. ప్రస్తుత రోజుల్లో చాలామంది జర్నలిస్టులు వృత్తిపరమైన ఒత్తిడిలకులోనై గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని ఆయన ఆవేదనవ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత గుండె సంబంధిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉచితంగా ఈసీజీ, టూడీఈకో, ఆర్‌బీసీలతో పాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు. వివేకానందనగర్‌లోని బండారు ఆస్పత్రిలో ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.13, వంకాయ రూ.23, బెండకాయ రూ.40, పచ్చి మిర్చి రూ.40, బజ్జి మిర్చి రూ.33, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.50, క్యాబేజీ రూ.13, బీన్స్ రూ.45, క్యారెట్ రూ.35, గోబి పువ్వు రూ.30, దొండకాయ రూ.45, చిక్కుడు కాయ రూ.45, గోరు చిక్కుడు రూ.28, బీట్‌రూట్ రూ.35, క్యాప్సికం రూ.40, ఆలుగడ్డ రూ.25, కీర రూ.31, దోసకాయ రూ.21, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.23, కంద రూ.65, ఉల్లిపొరక రూ.30, ఉల్లిగడ్డ రూ.35, మామిడికాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.37, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.30-40, మునగ కాయలు రూ.10-12, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.200, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.340, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.45, కరివేపాకు రూ.80, పర్వల్ రూ.55, పల్లికాయ రూ.65, లోబా రూ.30, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

తెలుగు పండుగల వెనుక విజ్ఞానం

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



పాండురంగనగర్‌లో మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, బీజేపీ మహిళామోర్చా శోభారాజన్, లీగల్‌సెల్ సద్గుణరెడ్డి

కూకట్‌పల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ముగ్గులు వేయడం ఆరోగ్యానికి ఎంతో మేలని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. శనివారం 117 డివిజన్ పరిధిలోని పాండురంగ కాలనీ పార్కు సమీపంలో బీజేపీ మహిళామోర్చా నాయకులు శోభారాజన్, రాష్ట్ర లీగల్‌సెల్ నాయకురాలు సద్గుణరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ, మన తెలుగు పండుగలు జరపడం వెనుక ఎంతో విజ్ఞానం దాగి ఉందన్నారు. ఇంటి ముందు కల్లాపు చల్లడం అంటే విష కీటకాలు ఇంట్లోకి రాకుండా ఉండాలనీ, పిండితో ముగ్గు వేయడం అంటే పక్షులు పిండిపదార్థాలు ఆహారంగా తీసుకుంటాయని ఇలా ఎన్నో విషయాలు దాగిఉన్నాయన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు మన పల్లెలకు అందించాలని కాలనీవాసులకు సూచించారు. ముగ్గుల పోటీలలో మొదటి విజేతగా నిలిచిన ధనలక్ష్మి, రెండో విజేత భాగ్యలక్ష్మి, మూడవ విజేత సాయినందినిలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఉదయ్, కాలనీవాసులు ఇందిరా, మనోహరి, వాసవి, ఎర్రస్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న శేరి సతీష్‌రెడ్డి తదితరులు

బాలాజీ ఎన్‌క్లేవ్‌లో..

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లోని బాలాజీ ఎన్‌క్లేవ్‌లో కేపీహెచ్‌బీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గులు వేసిన మహిళలు, చిన్నారులను కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డి సందర్శించి అభినందించారు. విజేతలతో పాటు ముగ్గు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు శేరి మమత తెలిపారు.

ఘనంగా గోదా రంగనాథ కల్యాణం



ధనుర్మాసం సందర్భంగా శనివారం ఖాజాగూడలోని కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోదా రంగనాథ కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పురోహితులు సకల శాస్త్రాలతో కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో కొమిరిశెట్టి ఫౌండేషన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- రాయదుర్గం, జనవరి 11(ఆంధ్రజ్యోతి)

దేశాభివృద్ధిలో యువత పాత్రే కీలకం



మాట్లాడుతున్న రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి వేడుకల సందర్భం గా కొండాపూర్‌లోని నారాయణ కళాశాలలో శనివారం నేషనల్ యూత్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. యువత నిరంతరం కష్టపడి పనిచేసే తత్వాన్ని అలవర్చుకోవాలని, ప్రయత్నించే వారికి విజయం వరిస్తోందన్నారు. ఫోరం ఫర్ ఐటీ అధ్యక్షుడు వినోద్ మాట్లాడుతూ.. దేశానికి యువత అమూల్యమైన సంపదని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర యువతదేనన్నారు. స్వామివివేకానంద చిన్న వయస్సులోనే పార్లమెంట్ ఆఫ్ వరల్డ్‌లో ప్రసంగించి దేశ సంస్కృతి, తత్వాన్ని చాటిచెప్పారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర స్పోక్‌పర్సన్ అమర్‌యాదవ్, బీజేవైఎం నాయకులు జయదేవ్, కృష్ణ, ధరణి, విద్యార్థులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ ఫీస్ట్



క్రిస్మస్ ఫీస్ట్‌లో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న పాస్టర్లు

హైదర్‌నగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషిగూడలోని ఫుల్ గస్పెల్ చర్చిలో తెలంగాణ ప్రభుత్వం సహకారంతో పాస్టర్స్ అందరూ కలిసి క్రిస్మస్ ఫీస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, పోశెట్టిగౌడ్, సంతోష్ బిరాదర్, ఉమేష్, పాస్టర్స్ ఇస్రాయిల్, ఏసురాజు, సత్యరాజు, ఫిలప్,విద్యాసాగర్, దేవదాస్, నాగభూషణం, కోకిల శ్యామ్యూల్, సంతోషమ్మ, పద్మమ్మ, సుమన్, శ్యాముల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మేధావుల సభకు తరలిన భెల్ ఉద్యోగులు



ఉస్మానియా యూనివర్సిటీలో శనివారం జరిగిన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలుకై మేధావుల సంఘీభావ సభకు బీహెచ్‌ఈఎల్ పరిశ్రమ నుంచి వివిధ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు తరలివెళ్లారు. భెల్ ఎస్సీ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్, నాయకులు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేధావుల సంఘీభావ సభకు మాదిగ ఉద్యోగులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

- భెల్‌కాలనీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి)

బ్యాడ్మింటన్ విజేత వెన్నెల జోడీ



ట్రోఫీలతో క్రీడాకారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యోనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బాలికల డబుల్స్‌లో హైదరాబాద్ జోడీ కె.వెన్నెల, వి.శ్రేయాన్షీ టైటిల్ కైవసం చేసుకుంది. గచ్చిబౌలిలోని గోపీచంద్ అకాడమీలో జరిగిన ఈ పోటీల బాలికల అండర్-19 ఫైనల్లో వెన్నెల-శ్రేయాన్షీ 21-15, 21-16తో తరిణి సూరి-రిషిక (తమిళనాడు)పై గెలిచింది. బాలుర అండర్-19 సింగిల్స్ ఫైనల్లో ప్రణవ్ రామ్ (తెలంగాణ) 16-21, 13-21తో రౌనక్ చౌహాన్(ఛత్తీస్‌గఢ్) చేతిలో ఓడి, రన్నరప్‌గా నిలిచాడు. తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం కోశాధికారి కానూరి వంశీధర్ విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

నేడు జర్నలిస్టులకు ఉచిత గుండె వైద్య పరీక్షలు

- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లాశాఖ అధ్యక్షుడు బాలరాజు



హైదర్‌నగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఆరోగ్యభద్రత కోసం ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లాశాఖ అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. బండారు ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సుశ్రుత్ పర్యవేక్షణలో వైద్యశిబిరం జరుగుతోందన్నారు. ప్రస్తుత రోజుల్లో చాలామంది జర్నలిస్టులు వృత్తిపరమైన ఒత్తిడిలకు లోనై గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత గుండె సంబంధిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఉచితంగా ఈసీజీ, 2డిఈకో, ఆర్‌బీసీలతో పాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు. వివేకానందనగర్‌లోని బండారు ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.13, వంకాయ రూ.23, బెండకాయ రూ.40, పచ్చి మిర్చి రూ.40, బజ్జి మిర్చి రూ.33, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.50, క్యాబేజీ రూ.13, బీన్స్ రూ.45, క్యారెట్ రూ.35, గోబి పువ్వు రూ.30, దొండకాయ రూ.45, చిక్కుడు కాయ రూ.45, గోరు చిక్కుడు రూ.28, బీట్‌రూట్ రూ.35, క్యాప్సికం రూ.40, ఆలుగడ్డ రూ.25, కీర రూ.31, దోసకాయ రూ.21, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.23, కంద రూ.65, ఉల్లిపొరక రూ.30, ఉల్లిగడ్డ రూ.35, మామిడికాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.37, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.30-40, మునగ కాయలు రూ.10-12, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.200, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.340, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.45, కరివేపాకు రూ.80, పర్వల్ రూ.55, పల్లికాయ రూ.65, లోబా రూ.30, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మంచుకురిసే వేళలో..






తెల్లవారుజామున మంచు కురిసే వేళలో ప్రకృతి అందాలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రోడ్డు ఉదయం సమయంలో ఇలా ఆకట్టుకుంది.

- రాయదుర్గం, జనవరి 11(ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి విశిష్టతను నేటి తరానికి తెలియజేయాలి



ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ టీకేఎన్‌క్లేవ్ కాలనీలో కేకే డిజిటల్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బలగం మూవీ ఫేమ్ సంజయ్‌తో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంక్రాంతి సంబరాల్లో మహిళలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను, సంక్రాంతి పండుగ విశిష్టతను నేటి తరానికి తెలియజేయడం ఈ ముగ్గుల పోటీల ప్రత్యేకతన్నారు. ముగ్గులు పోటీలు నిర్వహించిన కేకే డిజిటల్, మహిళ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, చంద్రిక ప్రసాద్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, సుప్రజ, నరేష్, శివ, శ్రీకాంత్‌రెడ్డి, కల్పన, లత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

- సిద్ధి చక్రం విశ్వశాంతి మహాయజ్ఞం

హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని వైశాలినగర్ కాలనీలో జైన్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్ధి చక్రం విశ్వశాంతి మహాయజ్ఞం కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానికులు శాస్త్రీ, సంబాత్ జైన్, శిల్పజైన్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రామస్వామియాదవ్

గచ్చిబౌలి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి గఫూర్‌నగర్‌లో కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, అసోసియేషన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

- కొండాపూర్‌లోని సంస్కృతి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మంగళారపు సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో చైర్మన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీఎం రిలీఫ్‌ఫండ్ అందజేత



లబ్ధిదారుకి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఎస్‌కే సోహైల్ అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతడికి మంజూరైన రూ.2.50 లక్షల మంజూరి పత్రాలను కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్, శ్రీకాంత్‌తో కలిసిఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ... అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం సహాయనిధి ఆపదలో ఉన్న వారికి అపన్నహస్తంలా సేవలు అందిస్తుందన్నారు. నాయులు రవీందర్‌ముదిరాజ్, ఖాదర్‌బాయ్, బోయ కిషన్, మోజెష్, భాస్కర్, ఖలీమ్, అన్వర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీడీపీఓ

హైదర్‌నగర్: శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓగా బాధ్యతలు స్వీకరించిన కవిత శనివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అంగన్‌వాడీ విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలను, యూనిఫామ్‌ను ఆయన ఆవిష్కరించారు. అంగన్‌వాడీ విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించడం జరుగుతోందని, మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, చిన్నపిల్లలు, గర్భిణిలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కోమలి, మాధురి, జ్యోతి, టీచర్లు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు



హాస్టళ్లలో సమస్యలను తెలుసుకుంటున్న ఇన్‌చార్జి వీసీ, అధికారులు

హైదరాబాద్ సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ బాలకిష్టారెడ్డి శనివారం విద్యార్థుల హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంజీర, కిన్నెర, కృష్ణ, గౌతమి హాస్టళ్లను సందర్శించి ఆయన విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. అనంతరం వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సంబంధిత విభాగం అధికారులను ఆదేశించారు. విద్యార్థులంతా తమ బైక్‌లను పార్క్ చేసేందుకు గౌతమి హాస్టల్ సెల్లార్‌ను, వాహనాల పార్కింగ్ కోసం వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు స్పందించిన అధికారులు, గౌతమి హాస్టల్ సెల్లార్‌ను వాహనాల పార్కింగ్‌కు మార్చుతూ ఉత్తర్వులు జారీచేశారు. యూనివర్సిటీ సంబంధిత సమస్యలు ఉన్నట్లయితే విద్యార్థులు తన దృష్టికి తేవాలని వీసీ సూచించారు.

నేడు జాతీయ యువ దినోత్సవం

మియాపూర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మియాపూర్ వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో జాతీయ యువ దినోత్సవం సందర్భంగా శ్రీరామకృష్ణ ఆదివారం క్విజ్, బృందగానం, ఉపన్యాసం పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రగతిఎన్‌క్లేవ్ కాలనీ శ్రీరామకృష్ణ ప్రభ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఒడిశా నుంచి ధూల్‌పేటకు గంజాయి

- నిఘాపెట్టి పట్టుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు
- రూ. 5.25 లక్షల విలువైన.. 21 కేజీల సరుకు స్వాధీనం
- 14 మందిపై కేసు నమోదు, ఆరుగురి అరెస్టు



గంజాయి మూటలతో పట్టుబడిన నిందితులు

హైదరాబాద్ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లుగప్పి, గుట్టుచప్పుడు కాకుండా ఒడిశా నుంచి ధూల్‌పేటకు గంజాయిని సరఫరా చేస్తున్న ముఠాను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 14 మంది నిందితులపై కేసులు నమోదు చేసిన పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 21 కేజీల గంజాయి, స్కూటీ, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 5.25 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ధూల్‌పేటకు చెందిన ఆకాశ్‌సింగ్ ఇంట్లో గంజాయి నిల్వ ఉందని ఎక్సైజ్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో శనివారం టీమ్ లీడర్ అంజిరెడ్డి పర్యవేక్షణలో ఎస్‌టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్) బృందం తనిఖీలు నిర్వహించింది. ఈక్రమంలో ఆకాష్ సింగ్ ఇంట్లో 21 కేజీల గంజాయి దొరికింది. అతడిని విచారించగా.. ఆకాష్‌సింగ్, దుర్గేష్ సింగ్, ఆనంద్‌సింగ్, శంకర్ సింగ్రా, హల్ సింగ్, లలిత్ కుమార్ కలిసి ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని తెప్పించినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిని విచారించిన క్రమంలో ఒడిశాకు చెందిన సురేష్ యాదవ్, ఉదయ్ సురేష్ దాలి, సరోజిత్ మరిదా, రాహుల్ సర్కార్, లంకా కుమార్, లాంప్‌లు గంజాయిని విక్రయించినట్లు తేలింది. వీరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ధూల్‌పేట్ ఎక్సైజ్ సీఐలు మధుబాబు, గోపాల్, ఎస్ఐ సైదులు, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి అజీమ్, శ్రీధర్, కానిస్టేబుళ్లు ప్రకాష్, రాకేష్, మహేష్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం కార్యదర్శి నర్సింహారెడ్డి

గచ్చిబౌలి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం కార్యదర్శి నర్సింహారెడ్డి అన్నారు. రంగారెడ్డిజిల్లా కమిటీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి లెబర్ అడ్డావద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లెబర్ అడ్డాల వద్ద కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలని, ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు లేక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. పనిచేసే సమయంలో ప్రమాదవశాత్తు గాయపడి, చనిపోయిన కార్మికులను ఆదుకోవడంలో భవన నిర్మాణ దారులు విఫలమవుతున్నారని ఆయన అన్నారు. కార్మికులకు ఎదైనా జరిగితే రాత్రికి రాత్రే ఇక్కడి నుంచి వారిని తరలించి వారి కుటుంబాలను ఆదుకోకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని తెలిపారు. నగరంలో ఏప్రిల్ 21,22,23 తేదీల్లో మహాసభలు ఉంటాయని, కార్మికులంతా పాల్గొని సభలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నివాసితులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి గోపనపల్లి మంజీరా డైమండ్ హైట్స్ మంజీరా పర్పుల్ టౌన్, మంజీరా డైమండ్ టవర్స్ గేటెడ్ కమ్యూనిటీల్లో శనివారం కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా నివాసితులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నేళ్లుగా ఉన్న డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్య, సీసీరోడ్లు, స్టార్మ్‌వాటర్ డ్రైయిన్‌లైన్ నిర్మాణం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ప్రాధాన్యం క్రమంలో పరిష్కరిస్తాని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానికులు ప్రసాద్, శ్యామ్‌ప్రదన్, అతుల్, అంకుర్, నటేశాన్ పాల్గొన్నారు.

నిథమ్‌లో ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తిచేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ గణేష్

రాయదుర్గం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలోని నిథమ్‌లో ఇందిరా మహిళా శక్తిక్యాంటీన్ నిర్వహణ శిక్షణలో భాగంగా ఈనెల 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు 24 మంది మహిళలకు వివిధ వంటకాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గణేష్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 161మంది మహిళలు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. క్యాంటీన్ సెటప్‌ల మౌలిక వసతుల కోసం ఆర్థికసాయం అందిస్తున్నట్టు తెలిపారు. ముడిసరుకులు, వంటగది నిర్వహణ బాధ్యత క్యాంటీన్‌లు నిర్వహించే మహిళలదే అన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో చెఫ్‌లు మహేష్ ఉల్హారామ్ డీపీఎం హమీద్, సెర్ప్ కోఆర్డినేటర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రమేష్‌కు ఐఏపీ ఫెలోషిప్



డాక్టర్ రమేష్‌కు ఫెలోషిప్ అందజేస్తున్న ఐఏపీ అధ్యక్షుడు డాక్టర్ వసంత్

హైదరాబాద్ సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) 62వ జాతీయ సదస్సు పెడికాన్ 2025ను హెచ్ఐసీసీలో నిర్వహించారు. హెచ్ఐసీసీలో బుధవారం ప్రారంభమైన ఈ సదస్సు ఆదివారంతో ముగుస్తుంది. ఈ సందర్భంగా పలువురు శిశు వైద్యులకు ఫెలోషిప్‌ను అందజేశారు. రాష్ట్రంలో పిల్లల ఆరోగ్యానికి సహకరించిన శిశు వైద్యుడికి ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ ఫెలోషిప్ ఇవ్వడం ఆనవాయితీ. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్‌లో 45 వేల మంది సభ్యులున్నారు. సభ్యుల్లో 0.1 శాతం మందికి ఫెలోషిప్ ఇచ్చి ప్రోత్సహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా నిలోఫర్ ఆస్పత్రి మాజీ ఆర్ఎంఓ డాక్టర్ రమేష్ దంపూరికి ఐఏపీ అధ్యక్షుడు డాక్టర్ కె.వసంత్ ఫెలోషిప్‌ను అందజేశారు. ఈ సదస్సుకు ఐఏపీ నుంచి వెయ్యి మంది సభ్యులు హాజరు కాగా, దేశ నలుమూలల నుంచి ఎనిమిది వేల మంది హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు.


డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద చెత్త డంపింగ్ ప్రాంతం

డబుల్ బెడ్‌రూమ్ ఏరియాలో చెత్తను తొలగించాలని ఆందోళన


ఆందోళనకారులతో మాట్లాడుతున్న బాచుపల్లి పోలీసులు

దుండిగల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల దగ్గర, పక్కనే ఉన్న సాయినగర్, మరోపక్క హిల్‌కౌంటీ ప్రాంతాల వద్ద మున్సిపాలిటీ సిబ్బంది చెత్తను కాల్చడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఇళ్ల మధ్యలో ఉన్న చెత్త డంపింగ్‌ను ఎత్తి వేయాలని సాయినగర్ వాసులు ఆందోళన చేపట్టి డిమాండ్ చేశారు. వీరికి మద్దతుగా స్థానిక మున్సిపల్ బాచుపల్లి బీజేపీ కమిటీ సభ్యులు, కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాచుపల్లి బీజేపీ అధ్యక్షుడు ప్రసాద్‌రాజు మాట్లాడుతూ బాచుపల్లి ఈ చెత్త డంపింగ్ చుట్టూ వెయ్యి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, సాయినగర్ కాలనీలో మరో 3 వేల జనాభా, మైటాస్‌లో ఐదు వందల కుటుంబాలు నివశిస్తున్నారన్నారు. జనావాసాల మధ్య చెత్త కాల్చడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారని పేర్కొన్నారు. దీని ద్వారా దుర్వాసన, విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలు కాల్చడం ద్వారా అందులో నుంచి విడుదలయ్యే పొగ వల్ల క్యాన్సర్ సోకే అవకాశం ఉందన్నారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకొని, పరిష్కరిస్తే బాగుంటుందని కోరారు. చెత్త డంపింగ్ వద్ద ఆందోళన సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పరిస్థితిని చక్కదిద్దారు.


వాహనదారులకు గులాబి పువ్వును అందజేస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ త్రివేణిబాయి, సిబ్బంది

నిబంధనలను పాటించాలి

పేట్‌బషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాలను నివారించేందుకు నిబంధనలను పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ త్రివేణిబాయి అన్నారు. శనివారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని మేడ్చల్ ఆర్‌టీఏ కార్యాలయం ముందు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వీస్ రోడ్డులో వచ్చి పోయే వాహనాలను తనిఖీలు చేసి సీటు బెల్ట్, హెల్మెంట్ ధరించని వాహనదారులకు గులాబి పుష్పాలను అందజేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ప్రయాణం చేస్తే, గమ్య స్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చని ఆమె తెలిపారు. ప్రతీ వాహనదారుడు నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గంగాధర్, జంగయ్య, రవీందర్, పాండురంగారెడ్డి, మహేష్, పాషా, మల్లేశం ఉన్నారు.



నియామకం

మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా రాచనోళ్ల లక్ష్మి రెండవసారి నియామకమైంది. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌గౌడ్‌ని కుత్బుల్లాపూర్ గ్రామంలోని ఆయన నివాసంలో ఆమె కలిసి మొక్కను అందజేశారు.

- పేట్‌బషీరాబాద్ (ఆంధ్రజ్యోతి)



ప్రారంభోత్సవం

ఇటుక బట్టీల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన పాఠశాలలను దుండిగల్ సీఐ సతీష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రంజిత్‌రెడ్డి, ఇటుక బట్టీల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాదవ్ ఉన్నారు.

- దుండిగల్ (ఆంధ్రజ్యోతి)



శుభాకాంక్షలు

మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలుగా నియమితులైన ఆర్.లక్ష్మి శనివారం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి ఆమెను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమ్య, సరస్వతి, శోభారాణి, సత్యనారాయణ ఉన్నారు.

- దుండిగల్ (ఆంధ్రజ్యోతి)



మర్యాద పూర్వక కలయిక

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు శనివారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. పలువురు తమ ప్రాంతంలో ఉన్న సమస్యలను విన్నవించుకున్నారు. ఎమ్మెల్సీ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

- దుండిగల్ (ఆంధ్రజ్యోతి)

పక్కలో బాంబుల్లా కెమికల్ గోదాంలు

- అక్రమ కెమికల్ గోదాంలతో పొంచి ఉన్న ప్రమాదం
- జీడిమెట్ల పారిశ్రామికవాడలో వరుస అగ్ని ప్రమాదాలు
- చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్న అధికారులు

జీడిమెట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలో వరుస అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నివాస ప్రాంతాల్లో విచ్చలవిడిగా వెలుస్తున్న కెమికల్ గోదాంలు ప్రజలకు పక్కలో బాంబుల్లా తయారయ్యాయి. గత నెలరోజుల కాలంలో మూడు అగ్ని ప్రమాదాలు జరగటంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలో వందలాది పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో కెమికల్ ఇరత ఉత్పత్తులు అందించే కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ విధానం ఏర్పాటుచేయాలి. కానీ ఎక్కువ శాతం పరిశ్రమలు ఫైర్ సేఫ్టీ ఏర్పాటు చేసుకోకుండానే నడిపిస్తున్నారు. ఫలితంగా నెలరోజుల క్రితం జేఈటీఎల్ రోడ్డులోని ప్లాస్టిక్ సంచుల తయారీ పరిశ్రమలో సంభవించిన అగ్నిప్రమాదంతో మూడు రోజులపాటు మంటలు ఆరకుండా పొగలు విపరీతంగా వ్యాపించి చుట్టుపక్కల కాలనీలు, బస్తీల ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.


దూలపల్లి రోడ్డులోని కెమికల్ గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదం (ఫైల్)


వాణి కెమికల్ ముందు కాలిపోయిన కెమికల్ లోడ్ లారీ (ఫైల్)


కాలిబూడిదైన చెట్లు (ఫైల్)

ఈ కంపెనీలో ఫైర్‌సేఫ్టీ సక్రమంగా లేకపోవడం వల్లనే ఈ ప్రమాదం సంభవించింది. అదేవిధంగా జీడిమెట్ల వాణి కెమికల్స్ సమీపంలో కెమికల్ డబ్బాల లోడుతో వెళ్తున్న లారీ దగ్ధం కావడంతో చుట్టుపక్కల కాలనీల ప్రజలు విష వాయువుల ఘాటుతో ఉక్కిరిబిక్కిరయ్యారు. నివాస ప్రాంతంలో అక్రమంగా ట్రాన్స్‌పోర్టు నిర్వహిస్తూ కెమికల్ డ్రమ్ములు నిల్వచేయడంపై కూడా స్థానిక డీపీ కాలనీ వాసులు తీవ్ర అభ్యంతరం తెలిపారు.

అదేవిధంగా దూలపల్లి రోడ్డులో అక్రమంగా నడుస్తున్న కెమికల్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ మంటలను అదుపు చేయడానికి ఫైర్‌సిబ్బంది మూడు గంటలు శ్రమించారు. కెమికల్ డబ్బాలు గాలిలో ఎగిరిపడటంతో రోడ్డుపైన ప్రయాణించే వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. కనీసం ఈ కెమికల్ గోదాంలలో ఎలాంటి ఫోమ్, ఫైర్‌సేఫ్టీ పరికరాలు లేకపోవడంతోనే ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తరచూ జరుగుతున్న ప్రమాదాలతో ప్రజల ప్రాణాలు పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం

జీడిమెట్ల, గాంధీనగర్, సుభాష్‌నగర్, దూలపల్లి, గంపలబస్తీ, ఎస్‌వీ కోఆపరేటివ్ సొసైటీలలో అనేక సంవత్సరాలుగా అక్రమంగా నడుస్తున్న కెమికల్ గోదాంలను తరలించాలని స్థానికులు అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదు. గంపలబస్తీ, సుభాష్‌నగర్ నివాస ప్రాంతాల్లో కెమికల్ డంపింగ్ గోదాంలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ గోదాంలలో అగ్ని ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. అయినా కూడా అధికారులలో చలనం లేకపోవడం విచారకరం. తక్షణమే అక్రమ కెమికల్ గోదాంలు తరలించాలని, ప్రతి పరిశ్రమలో ఫైర్‌సేఫ్టీ ఉండేవిధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నివారణకు చర్యలు తీసుకుంటున్నాం

జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలో చోటు చేసుకుంటున్న అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కెమికల్ కంపెనీల్లో పని చేసే కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇస్తున్నాం. ఫైర్ సేఫ్టీ తీసుకోని కంపెనీలపై చర్యలు తీసుకుంటాం.

- శేఖర్‌రెడ్డి, ఫైర్ అధికారి, జీడిమెట్ల


ఓబన్న చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించిన వడ్డెర సంఘ నాయకులు


కొంపల్లిలో వడ్డె ఓబన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి వేడుకలు

గాజులరామారం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని వడ్డెర సంఘ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. గాజులరామారం డివిజన్‌లోని రావినారాయణరెడ్డినగర్, గాలి పోచమ్మబస్తీలో ఆయన చిత్రపటానికి అఖిల భారత వడ్డెర సంఘ జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజె శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వడ్డెర సంఘం వారు ఐకమత్యంగా ఉంటూ, సమస్యలను పరిష్కరించుకోవాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ మహిళా అధ్యక్షురాలు తిరుమలాదేవి, రాష్ట్ర కార్మిక విభాధ్యక్షుడు సాతాల గోపాల్, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఇడగొట్టి పార్వతి, రాష్ట్ర యువజన అధ్యక్షుడు బొందాసు శ్రీనివాస్, రాష్ట్ర కార్మిక విభాగ కార్యదర్శి నగేష్, మేడ్చల్, మల్కాజ్‌గిరి యువజన అధ్యక్షుడు వడ్డె మురళీ, హైదరాబాద్ యూత్ యువజన అధ్యక్షుడు నాగరాజు, మహిళలు పాల్గొన్నారు.

కొంపల్లిలో..

వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా కొంపల్లి మున్సిపాలిటీలోని ఉమామహేశ్వరకాలనీలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో ఓబన్న చిత్ర పటానికి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్, బీజేపీ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్ రాజిరెడ్డి, బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ శివాజీరాజు, ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ సాగర్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, మహేష్ ఉన్నారు.


హాస్టళ్లలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఇన్‌చార్జి వీసీ, అధికారులు

జేఎన్‌టీయూ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీ

- సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించిన ఇన్‌చార్జి వీసీ

హైదరాబాద్ సిటీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ బాలకిష్టారెడ్డి శనివారం విద్యార్థుల హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంజీర, కిన్నెర, కృష్ణ, గౌతమి హాస్టళ్లను సందర్శించి ఆయన విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. అపై వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సంబంధిత విభాగం అధికారులను ఆదేశించారు.

విద్యార్థులంతా తమ బైక్‌లను పార్క్ చేసేందుకు గౌతమి హాస్టల్ సెల్లార్‌ను, వాహనాల పార్కింగ్ కోసం వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు స్పందించిన అధికారులు, గౌతమి హాస్టల్ సెల్లార్‌ను వాహనాల పార్కింగ్‌కు మార్చుతూ ఉత్తర్వులు జారీచేశారు. యూనివర్సిటీ సంబంధిత సమస్యలు ఉన్నట్లయితే విద్యార్థులు తన దృష్టికి తేవాలని వీసీ సూచించారు.


నూతన కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభిస్తున్న హన్మంత్‌రెడ్డి

కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం

జీడిమెట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ పనులను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ప్రారంభించారు. గతంలో నూతన కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకురాగా ఇన్‌చార్జి మం త్రి శ్రీధర్ బాబును సంప్రదించి రూ.10 లక్షలు మంజూరు చేయించి, పనులను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, మజీద్ బాషా, వెంకట్‌రెడ్డి, ఆనంద్, అంజిరెడ్డి, యూసూబ్, నాగేంద్ర, శ్యామ్ పాల్గొన్నారు.

నేడు శృంగేరీ శారద శంకర మఠంలో పారాయణం

కూకట్‌పల్లి, జనవరి, 11 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్ శృంగేరి శారద శంకర మఠంలో శ్రీ లలిత సహస్రనామ అఖండ పారాయణం పఠనం ఉందని శంకరమఠం ప్రతినిది మూర్తి తెలిపారు. ఆదివారం శృంగేరీమఠంలో ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అఖండ పారాయణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

ఒడిశా నుంచి ధూల్‌పేటకు గంజాయి

- నిఘాపెట్టి పట్టుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు
- రూ. 5.25 లక్షల విలువైన 21 కేజీల సరుకు స్వాధీనం
- 14 మందిపై కేసు నమోదు ఆరుగురి అరెస్టు


గంజాయితో పట్టుబడిన నిందితులు

హైదరాబాద్ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లుగప్పి, గుట్టుచప్పుడు కాకుండా ఒడిశా నుంచి ధూల్‌పేటకు గంజాయిని సరఫరా చేస్తున్న ముఠాను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 14 మంది నిందితులపై కేసులు నమోదు చేసిన పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 21 కేజీల గంజాయి, స్కూటీ, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 5.25 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ధూల్‌పేటకు చెందిన ఆకాశ్‌సింగ్ ఇంట్లో గంజాయి నిల్వ ఉందని ఎక్సైజ్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో శనివారం టీమ్ లీడర్ అంజిరెడ్డి పర్యవేక్షణలో ఎస్‌టీఎఫ్(స్టేట్ టాస్క్‌ఫోర్స్) బృందం తనిఖీలు నిర్వహించింది.

ఈ క్రమంలో ఆకాష్‌సింగ్ ఇంట్లో 21 కేజీల గంజాయి దొరికింది. అతడిని విచారించగా.. ఆకాష్‌సింగ్, దుర్గేష్‌సింగ్, ఆనంద్‌సింగ్, శంకర్ సింగ్రా, హాల్ సింగ్, లలిత్ కుమార్ కలిసి ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని తెప్పించినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరి ని విచారించిన క్రమంలో ఒడిశాకు చెందిన సురేష్ యాదవ్, ఉదయ్ సురేష్ దాలి, సరోజిత్ మరిదా, రాహుల్ సర్కార్, లంకా కుమార్, లాంప్‌లు గంజాయిని విక్రయించినట్లు తేలింది. వీరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ధూల్‌పేట్ ఎక్సైజ్ సీఐలు మధుబాబు, గోపాల్, ఎస్ఐ సైదులు, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి అజీమ్, శ్రీధర్, కానిస్టేబుళ్లు ప్రకాష్, రాకేష్, మహేష్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తెరుచుకున్న మరుగుదొడ్లు

దుండిగల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్‌లో మరుగుదొడ్లకు తాళం అనే శీర్షికన 9న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కమిషనర్ సత్యనారాయణ మరుగుదొడ్లకు వేసి ఉన్న తాళాలను తీయించి, సిబ్బందితో మరుగుదొడ్లను శుభ్రం చేయించారు. అక్కడ పని చేసే కార్మికుడు సరిగా పనులు నిర్వర్తించకపోవడంతో విధుల నుంచి తొలగించి, మరొకరిని నియమించారు. దీంతో ప్రయాణికులు, స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.

అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయాలి


అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

కుత్బుల్లాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలోని చంద్రానగర్‌లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. చంద్రానగర్ రోడ్ నంబర్ 9లో కొన్ని నెలల క్రితం భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్వి పైపులైన్ నిర్మించారు. ప్యాచ్ వర్క్‌లు చేయడం మరిచిపోయారు. దీంతో ఆ మట్టిరోడ్డంతా గుంతలుగా మారింది. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ఎత్తుగా ఉండి వాహనదారులు, చిన్నారులు, వృద్ధులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయంపై స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని అధికారులపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్యాచ్‌వర్క్‌లు చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

ప్రయాణికులతో రద్దీగా బస్టాప్‌లు

పేట్‌బషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళుతున్న వారితో జాతీయ రహదారి 44కి ఇరువైపులా ఉన్న బస్టాపులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. స్కూళ్లకు సెలవులు ప్రకటించడంతో సొంత ఊరుకి వెళ్లేందుకు విద్యార్థులు, అలాగే ఉద్యోగాలతో హైదరాబాద్‌లో స్థిరపడినవారితో కొంపల్లి, ఎన్‌సీఎల్, సుచిత్రా బస్టాపులు శనివారం జనంతో కిక్కిరిసిపోయాయి.

నేడు గాంధీనగర్‌లో రక్తదాన శిబిరం

పేట్‌బషీరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు యూత్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మినాద్ తెలిపారు. 2013 నుంచి 18 రక్తదాన శిబిరాలు, 70 ఉచిత కార్యక్రమాలు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్నామన్నారు. ఆదివారం గాంధీనగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే రక్తదాన శిబిరానికి యువకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

వృద్ధుడి మృతి

గాజులరామారం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : చలి తీవ్రతతో సూరారం బస్‌స్టేషన్‌లో భిక్షాటన చేసుకునే ఓ వృద్ధుడు మృతి చెందాడు. గత కొన్ని నెలలు తరబడి భిక్షాటన చేసుకుంటూ బస్టాప్‌లోనే నిద్రపోయేవాడు. శనివారం బస్టాప్‌కు వచ్చిన స్థానికులు సూరారం పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతిని వివరాలు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.